
సాక్షి
బాపట్ల
మంగళవారం । 4 । మార్చి । 2025



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేటరూరల్: రెడ్డినగర్‌లోని వరసిద్ది వినాయకస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు జరిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 527.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అప్పాపురం ప్రభకు గ్రామోత్సవం



నాదెండ్ల: మహాశివ రాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వచ్చిన అప్పాపురం గ్రామ ప్రభకు సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
బాపట్ల	6.21	5.07
నరసరావుపేట	6.23	5.09
గుంటూరు	6.21	5.07






కౌంటింగ్ అటెన్షన్

గుంటూరు ఏసీ కాలేజీలో ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రారంభమైంది. మొత్తం 483 పోలింగ్ బూత్‌లలో పోలైన 2,41,493 ఓట్లను బ్యాలెట్ బాక్స్‌ల నుంచి తీశారు. 50 చొప్పున 4,828 బండిల్స్, మిగిలిన 93 ఓట్లతో ఒక బండిల్‌లో కట్టే ప్రక్రియ మధ్యాహ్నం పూర్తయింది. ప్రస్తుతం 28 టేబుల్‌లకు రౌండ్‌కు 1000 చొప్పున ఓట్లను ఇచ్చి కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవతేజ, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని బ్రహ్మోత్సవ ఆదాయం రూ.44.50 లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖ ప్రత్యేక అధికారి ఇ.సత్యనారాయణరెడ్డి సమక్షంలో దేవాలయంలో ఉన్న 10 హుండీలతోపాటుగా తాత్కాలిక హుండీలను తెరచి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వాహణాదికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం లెక్కింపు చేపట్టగా.. హుండీల ఆదాయం రూ.28,61,262 వచ్చిందన్నారు. పూజా టికెట్లు, శివరాత్రి ప్రత్యేక అభిషేక పథకం, లడ్డూ ప్రసాదం ఇతరాల ద్వారా మొత్తం రూ.15,89,493 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈఏడాది శివరాత్రికి మొత్తం రూ.44,50,755 ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో తెనాలి, గుంటూరులకు చెందిన భక్తజన సేవాసమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది ఏప్రియల్‌లో నిర్వహించనున్న డిగ్రీ రెండవ సెమిస్టర్, వన్‌టైమ్ పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను విడుదల చేశామని సీఈ ఎ శివప్రసాదరావు తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 25 ఆఖరు తేదీగా నిర్ణయించామని, రూ.100 ఆలస్య రుసుంతో ఈనెల 27వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రాక్టికల్, ప్రాజెక్ట్, వైవా–ఓసీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి, థియరీ పరీక్షలు 25వ తేదీ నుంచిప్రారంభమవుతాయని చెప్పారు. పరీక్ష ఫీజు తదితర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

నేడు వైద్య కళాశాల 74వ స్నాతకోత్సవం

గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల 74వ స్నాతకోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వేడుకలు జరుగుతాయన్నారు.

‘ఆలపాటి’ దూకుడు

- గుంటూరు ఏసీ కాలేజీలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం
- అన్ని రౌండ్లలో ఆలపాటి ముందంజ
- భారీగా పోలీసు బందోబస్తు

సాక్షి ప్రతినిధి, గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు దిశగా సాగుతున్నారు. నాలుగు రౌండ్లు ముగిసేసరికి మొత్తం 28 టేబుళ్లలో 1,12,297 ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యింది. ఇందులో 1,00,209 ఓట్లు చెల్లుబాటు కాగా, 12088 చెల్లలేదు. సుమారు పది శాతం ఓట్లు చెల్లకపోవడం గమనార్హం. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 67679 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 29,188 ఓట్లు వచ్చాయి. ఇద్దరి మధ్యా 38,491 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. పోస్టల్ బ్యాలెట్‌లో 371 ఓట్లు వచ్చాయి. అందులో 316 చెల్లుబాటు కాగా, 55 ఓట్లు చెల్లలేదు. మొత్తం 483 పోలింగ్ బూత్‌లలో పోలైన 2,41,493 ఓట్లును బ్యాలెట్ బాక్స్‌ల నుంచి తీసి 50 చొప్పున 4,828 బండిల్స్ కట్టారు. మిగిలిన 93 ఓట్లతో బండిల్‌లో కట్టే ప్రక్రియ మధ్యాహ్నం సమయానికి పూర్తయింది. ప్రస్తుతం 28 టేబుళ్లకు రౌండ్‌కు 1000 చెప్పున ఓట్లను ఇచ్చి కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలకురాలు పి.కరుణ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, పల్నాడు కలెక్టర్ పి. ఆరుణ్‌బాబు పర్యవేక్షిస్తున్నారు.

ఉదయం నుంచి లెక్కింపు ప్రక్రియ

సోమవారం ఉదయం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేర్చి, పోలింగ్ అయిన ఓట్లు సరిచూసి వాటిని కట్టలు కట్టారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు హాలులో కూర్చొని ప్రక్రియను పరిశీలిస్తుండగా కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. చెల్లని ఓట్లను వేరు చేశారు. చెల్లిన ఓట్లను మొదటి ప్రాధాన్యత ఓటు ప్రకారం అభ్యర్థులకు కేటాయించిన ట్రేలలో వేసి లెక్కిస్తున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు కేటాయించిన ప్రదేశాలలో వాహనాలు పార్కింగ్ చేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. లెక్కింపు కేంద్రం పరిసరాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు.

మొదటి రౌండ్ ఫలితం

సాయంత్రం 5:00 గంటలకు మొదటి రౌండులో 28,312 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 25,242. చెల్లని ఓట్లు 3,070

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	–17,194
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	– 7214
మెజారిటీ	– 9,980

రెండో రౌండ్

రాత్రి 6:45 గంటలకు రెండో రౌండ్‌లో 56,312 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 50,237. చెల్లని ఓట్లు 6075

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	– 34,721
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	– 13,956
మెజారిటీ	– 20,765

మూడో రౌండ్

రాత్రి 8:15 గంటలకు జరిగిన మూడో రౌండ్‌లో 80,305 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 71,252. చెల్లని ఓట్లు. 9053

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	– 51,443
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	– 21,360
మెజారిటీ	– 30,083 ఓట్లు

నాల్గవ రౌండ్

రాత్రి 10 గంటలకు నాల్గవ రౌండ్‌లో 1,12,297 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి చెల్లుబాటు అయిన ఓట్లు 1,00,209. చెల్లని ఓట్లు 12,088

తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి	– 67,679 ఓట్లు
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	– 29,188 ఓట్లు
మెజారిటీ	– 38,491

ఇంటర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఏఎస్పీ

- ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు
- అడిషినల్ ఎస్పీ విఠలేశ్వర్ వెల్లడి



చీరాల: ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా అడిషినల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ తెలిపారు. సోమవారం చీరాలలోని ఏకేపీ అండ్ పీకే జూనియర్ కాలేజి, వీఆర్‌ఎస్‌వైఆర్‌ఎన్ కాలేజీలోని ఇంటర్ ద్వితీయ పరీక్ష కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత సమాధాన పత్రాలను తగిన ఎస్కార్ట్‌తో సంబంధిత కార్యాలయాలకు చేర్చాలన్నారు. జిల్లాలో 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరుగుతందన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పరీక్ష కేంద్రం దగ్గరలో జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లుమూసివేయాలని ఆదేశించారు.

పర్చూరు నియోజకవర్గంలో

ఫారం-7తో ఓట్ల తొలగింపుపై సిట్

- ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జీవించి ఉన్న ఓటర్లు మృతి చెందినట్లుగా పేర్కొంటూ ఫారం–7తో ఓట్ల తొలగింపునకు పాల్పడటంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో మరో ఇద్దరు సభ్యులతో సిట్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి ఆధారంగా సిట్ ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. 24,000 ఓట్లు తొలగింపునకు ఫారం–7 దరఖాస్తులను అక్రమంగా చేశారని, జీవించి ఉన్న వారు మృతి చెందినట్లు పేర్కొన్నారని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో గతంలోనే కేసు నమోదు చేశారు. అయితే ఎటువంటి చర్యలను తీసుకోలేదని, దీనిపై సిట్ చేత దర్యాప్తు చేయించాలని ఎమ్మెల్యే కోరినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రకాశం ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు డీజీపీ ద్వారా మరో అధికారి నియమించుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐడీ డీజీ ఆదేశాలు, పర్యవేక్షణలో సిట్ పనిచేయాలని పేర్కొన్నారు. సిట్ సాక్షులను, పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టానికి లోబడి నిందితులను అరెస్టు చేయడం, నిర్బంధించడం చేయవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దర్యాప్తు పురోగతికి సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు త్రైమాసిక నివేదికను సిట్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోట్లు ఖర్చు చేశారు..కామన్‌గా వదిలేశారు

- ఐదేళ్ల కిందట 12 చేనేత కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణం
- ఒక్కో సెంటర్‌కు రూ.33 లక్షలు వ్యయం
- ఎంపీకి, ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర విభేదాలు



ఈపూరుపాలెంలో నిర్మించిన కామన్ ఫెసిలిటీ సెంటర్

చీరాల: ఇంటిగ్రేటెడ్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐహెచ్‌డీఎస్) ద్వారా జిల్లాలో 12 కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఐదేళ్ల కిందట నిర్మించారు. అందులో చీరాలలో ఏకంగా తొమ్మిది సెంటర్లకు భవన నిర్మాణాలు చేశారు. వీటి ప్రధాన ఉద్దేశం ఆ ప్రాంత చేనేత కార్మికులంతా ఒక చోట చేరి వీవింగ్, డైయింగ్, డిజైనింగ్, మార్కెటింగ్ వంటి సౌకర్యాలను పొంది తద్వారా చేనేత రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్లి కార్మికులు ఆర్థిక స్వాలంబన సాధించాలనేది. ఈ స్కీమ్‌ను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. ఇందులో భాగంగానే ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లిలతోపాటు జిల్లాలో చేనేతలు ఉన్న ప్రాంతంలో 12 సెంటర్ల వరకు నిర్మించారు. ఒక్కో భవనానికి రూ.33 లక్షలు మంజూరు చేశారు. ఇది పూర్తయ్యి ఐదేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి చేనేత కార్మికులకు, సహకార సంఘాలకు వీటిని అప్పగించి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన డిజైన్లను కార్మికులకు అందించి తద్వారా చేనేత వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉంది. అలానే డైయింగ్ యూనిట్, నూతన మగ్గాలపై ట్రైనింగ్, తయారైన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం అలానే నేసిన వస్త్రాలను నిల్వ ఉంచేందుకు ఈ కామన్ ఫెసిలిటి సెంటర్‌లో అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

భవనాలు దెబ్బతింటున్నా..

కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన కామన్ ఫెసిలిటి సెంటర్ భవనాలు దెబ్బతింటున్నప్పటికి ప్రారంభానికి నోచుకోలేదు. చేనేత శాఖ అధికారులు కుంటి సాకులు చెప్తున్నారే తప్ప వాటిని చేనేతలకు అందుబాటులో తెచ్చేందుకు కనీస ప్రయత్నం చేయడం లేదు. అదేమంటే సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదని, అవి ఎవరికి అప్పగించాలో పూర్తి స్థాయిలో తమకు ఆదేశాలు అందలేదన్నారు. తోటవారిపాలెంలో నిర్మించిన కామన్ ఫెసిలిటి సెంటర్ శిథిలావస్థకు చేరి మూలనపడింది. చేనేత కార్మికులు ఉన్న ప్రాంతాలను గుర్తించి నిర్మించిన ఈ భవనాలు ప్రారంభమైతే కార్మికులకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం పాత డిజైన్లు నేయడం వలన మార్కెటింగ్ సౌకర్యం సరిగా లేక వస్త్రాలు నిల్వ ఉంటున్నాయి. అదే ఫెసిలిటి సెంటర్లు ప్రారంభానికి నోచుకుంటే కొత్త డిజైన్లు ఆవిష్కరించి మరమగ్గాలపై నేస్తున్న వస్త్రాలకు దీటుగా అమ్ముకునే అవకాశం కలుగుతుంది. అలానే ఉచితంగా వస్త్రాలకు డైయింగ్ చేసుకోవచ్చు. నూలు, రంగు, రసాయనాలు సబ్సిడీపై వచ్చే అవకాశం ఉంటుంది. అలానే నేసిన వస్త్రాలకు ఈ ఫెసిలిటి సెంటర్‌లోనే మార్కెటింగ్ చేసుకోవచ్చు. కొత్తవారు సైతం మగ్గంపై నేయడం నేర్చుకునే అవకాశం ఉంది. ఇంత ప్రయోజనం ఉన్న ఈ కామన్ ఫెసిలిటి సెంటర్‌లో రాజకీయ నీలినీడలు, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.

భవనాలపై రాజకీయ నీలినీడలు

కేంద్ర ప్రభుత్వం స్కీమ్ ద్వారా నిర్మించిన భవనాలను ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించాల్సి ఉంటుంది. కాని బాపట్ల ఎంపీకి, చీరాల ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర విభేదాలు నడుస్తున్నాయి. చీరాలలో ఎంపీ వర్గం, ఎమ్మెల్యే వర్గంగా కూటమి నాయకులు మారిపోయారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్లు ప్రారంభానికి నోచుకోవడం లేదని చర్చించుకుంటున్నారు.

త్వరలో నిర్ణయం తీసుకుంటాం..

కేంద్ర ప్రభుత్వ పథకం ఐహెచ్‌డీఎస్ ద్వారా జిల్లాలో 12 సెంటర్లను నిర్మించాం. ఒక్కో భవనానికి గాను రూ.33 లక్షలు ఖర్చు అయింది. ఈ భవనాలు త్వరలో కార్మికులకు ప్రయోజనం చేకూరేలా చేస్తాం. సహకార సంఘ ఎన్నికలు జరిగితే ఈ కమిటిలకు ఇవ్వాలని తమ ఉద్దేశం. ఇంకా సహకార సంఘ ఎన్నికలు జరగలేదు. జరిగితే సహకార సంఘాలకు ఇవ్వాలా... కార్మికులను కమిటీగా వేసి ఇవ్వాలనేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేస్తాం. త్వరలో వీటిపై నిర్ణయం తీసుకుని చేనేత కార్మికులకు ఉపయోగపడేలా చూస్తాం.

శివనాగమల్లేశ్వరరావు, ఏడీ, బాపట్ల జిల్లా

అక్రమ కట్టడాలకు అడ్డా బాపట్ల

- అనుమతులకు మించి అపార్టుమెంట్ల నిర్మాణం
- చోద్యం చూస్తోన్న అధికారులు



చీలురోడ్డు సెంటర్‌లో రోడ్డు పక్కనే నిర్మాణంలో షాపులు

బాపట్ల:అక్రమ కట్టడాలకు బాపట్ల పట్టణం అడ్డాగా మారింది. ఓ వైపు అనుమతులకు మించి అపార్టుమెంట్ల నిర్మాణం చేపడుతున్నారు. మరో వైపు నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు పచ్చనేతల అండదండలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆక్రమణలు ఇలా..

బాపట్ల పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే చీలురోడ్డు సెంటర్‌లో అక్రమ కట్టడానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అక్రమంగా ఉన్న ఇళ్లను తొలగించి మరోచోట స్థలాన్ని కేటాయించారు. తాజాగా రోడ్డు పక్కన కొద్ది స్థలం ఉండగా దానికి తోడు రోడ్డును కొద్దిగా కలుపుకుని షాపుల నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై పట్టణ ప్రణాళికా విభాగానికి ఫిర్యాదు చేయగా అది దేవదాయశాఖ పరిధిలో ఉన్న స్థలంగా టీపీఓ ఎస్.మల్లికార్జునరావు చెబుతున్నారు. దేవదాయశాఖ ఏఓ వెంకటేశ్వరరావును వివరణ కోరగా విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అక్కడ నుంచి నిర్ణయం వచ్చాక చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఒకరిపై ఒక్కరు చెప్పుకుంటూ చోద్యం చూస్తున్నారు.

అనుమతులకు మించి...

నిబంధనల ప్రకారం వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్లు నిర్మాణం చేపట్టాలంటే ఆ స్థలం ఎదుట నిర్దిష్టమైన రోడ్డు ఉండాలి. ఈ మేరకు రెండు, మూడు అంతస్తులు నిర్మించేందుకు మాత్రమే అవకాశం ఉంది. అయితే జీప్లస్–3 అనుమతులు తీసుకుని ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఐదు అంతస్తులు నిర్మించటం, రోడ్డుకు మార్జిన్ లేకుండా నిర్మాణాలు, పార్కింగ్ స్థలం లేకుండా కట్టడాలు చేపట్టడంతో తరువాత ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిబంధనలకు నీళ్లు వదిలారు. పట్టణంలోని సూర్యలంక రోడ్డులో, అంబేడ్కర్ సెంటర్‌లో రెండు వాణిజ్య సముదాయాలు యథేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నారు.



సూర్యలంక రోడ్డులో అనుమతికి మించి నిర్మించిన అపార్టుమెంట్

అనుమతులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలకు ప్లాన్లు ఇవ్వటం జరిగింది. అనుమతికి మించి నిర్మాణం చేపడితే వెంటనే చర్యలు తీసుకుంటాం. పట్టణంలో మునిసిపాల్టీ ఇచ్చిన అనుమతులకు మించిన వారికి నోటీసులు జారీ చేసి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు మించి ఎవరూ నిర్మాణ పనులు చేపట్టరాదు.

–ఎస్.మల్లికార్జునరావు, టీపీఓ

న్యాయవాద వృత్తిలో నిజాయితీ అవసరం

హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ శివయ్యనాయుడు

చీరాలరూరల్: న్యాయవాద వృత్తిలో రాణించాలంటే నిబద్ధత, నిజాయితీతో నిరంతరాయంగా కృషి చేయాలని ఏపీ హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ ఎన్.శివయ్య నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన చీరాల వచ్చిన సందర్భంగా చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తాను 30 ఏళ్ల కిందట చీరాల కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసినప్పటికి తనను గుర్తుపెట్టుకుని చీరాలకు ఆహ్వానించి ఇంతగా అభిమానించడం ఆనందంగా ఉందని చెప్పారు. చీరాలలో న్యాయవాదులు ఎంతో సౌమ్యులని, మృదుస్వభావం గలవారని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే న్యాయశాస్త్రాలకు సంబంధించిన అనేక పుస్తకాలను అవపోసన పట్టి జ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు. న్యాయవాది పట్టా పొందిన వ్యక్తికి న్యాయవాద వృత్తిలోనే కాక న్యాయమూర్తులుగా, పెద్దపెద్ద మల్టీనేషన్ కంపెనీలలో లీగల్ అడ్వయిజర్లుగా ఉద్యోగాలు చేరవచ్చని చెప్పారు. తాను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేసిన కాలంలో చీరాల న్యాయవాదుల నుంచి న్యాయమూర్తులపై కానీ ఉద్యోగులపై కానీ ఎటువంటి ఫిర్యాదులు అందలేని చెప్పారు. అనంతరం సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ శివయ్యనాయుడుకు జీడిపప్పు దండవేసి సత్కరించారు. అలానే 25 మంది జూనియర్ న్యాయవాదులకు కొత్తగా వచ్చిన క్రిమినల్ న్యాయ చట్టాలకు సంభందించిన పుస్తకాలను ఆయన చేతులు మీదుగా అందజేశారు. అలానే విశ్రాంత జిల్లా అదనపు న్యాయమూర్తులు గిరిజా మనోహర్, లక్ష్మీనారాయణ, ఏపీ న్యాయవాద గుమస్తాల సంఘాన్ని ఏర్పాటు చేసి, న్యాయవాద గుమస్తాలకు సంక్షేమ పథకాల ఏర్పాటుకు కృషిచేసిన సీనియర్ న్యాయవాద గుమస్తా కాజా సూర్యప్రకాశరావును పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొవర రమేష్‌బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.



హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ శివయ్య నాయుడును సత్కరిస్తున్న న్యాయవాదులు

క్లుప్తంగా

శబ్ద కాలుష్యం నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ



ప్రదర్శన చేపట్టిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల: శబ్ద కాలుష్యం నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన ప్రదర్శనను డాక్టర్ విజయమ్మ ప్రారంభించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వినికిడి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. చెవి వినడం ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పెద్ద, పెద్ద శబ్దాల నుంచి చెవిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వతేదీ లోపు తెలియచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ద్వారా రూపొందించామన్నారు. జాబితాలు జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయాలతో పాటు విద్యాశాఖ వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యంతరాలు తెలిపే ఉపాధ్యాయులు తమ పూర్తిపేరుతో కూడిన వివరాలు, జాబితాలోని తప్పిదం స్పష్టంగా పేర్కొనటంతో పాటు ఆధారాలు సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమన్నారు. వచ్చిన అభ్యంతరాలపై ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తెలియచేస్తారని తెలిపారు. వివరాలకు జిల్లా విద్యాశాఖ, జోనల్ విద్యాశాఖ కార్యాలయాలలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేద వర్గాలకు మేలు

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- గ్రామ నూతన కమిటీల నియామకం



మాట్లాడుతున్న వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: పేద వర్గాలకు చెందిన కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఎనలేని మేలు చేకూరిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక గ్రామాలలో వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాల కోసం పెత్తందార్లతో పోరాడుతూ, ప్రతి కుటంబానికి ఆర్థికంగా మేలు జరిగేలా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అబద్ధపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిందని, నేడు హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి, ప్రజాపక్షాన పోరాడటానికి గ్రామ కమిటీలు దోహదపడతాయన్నారు. చిలుమూరు శివారు చిలుమూరులంక గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శిగా తోడేటి పాల్‌మార్క్, కార్యదర్శిగా మెరకనపల్లి రత్తాలును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో కొల్లూరు, భట్టిప్రోలు మండల కన్వీనర్‌లు సుగ్గున మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఈపూరులంక సర్పంచి మేకతోటి శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మాజీ సర్పంచి కట్టుపల్లి సోమయ్య, నాయకులు దివి వెంకటేశ్వరరావు గుంటూరు పవన్‌కుమార్, వెలివల రామకృష్ణ, శంకర్, కూరేటి కోటేశ్వరరావు, బాణాల తనీష్, స్థానిక నాయకులు తోడేటి సతీష్, గుమ్మడి యేబు, తోడేటి రమేష్, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు.

నేడు లంక గ్రామాలలో గ్రామ కమిటీల నియామకం

వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీల నియామక ప్రక్రియ మంగళవారం కొల్లూరు మండలంలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు సోమవారం తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్‌కు మంటలు

- వీరన్నపాలెంలో అగ్నిప్రమాదం
- డ్రైవర్ చాకచక్యంతో కూలీలు, ట్రాక్టర్ సురక్షితం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన వరిగడ్డి

పర్చూరు(చినగంజాం): డ్రైవర్ చాకచక్యంతో పెనుప్రమాదం తప్పింది. వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి నిప్పులు చెలరేగడంతో తీవ్రంగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన వరిగడ్డిని పొలం నుంచి ఇంటికి చేరుస్తున్నాడు. ఈక్రమంలో వరిగడ్డి ట్రాక్టర్ పంచాయతీ కార్యాలయం ముందుగా వెళ్తున్న సమయంలో ఆ మార్గంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వరిగడ్డి పూర్తిగా తగలబడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆనందరావు చాకచక్యంగా వ్యవహరించాడు. తానేమాత్రం భయాందోళనకు గురికాకుండా గడ్డిని పక్కన పడేసి అందులో ఉన్న కూలీలను, ట్రాక్టర్‌ను కాపాడాడు. వెంటనే స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గడ్డి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లి ఉంటుందని సమాచారం.

ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం

విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ



విశేష అర్చన చేస్తున్న విశ్వంజీ

ప్రత్తిపాడు: ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం కలుగుతుందని విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ అన్నారు. విశ్వంజీ జన్మదిన వేడుకల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం మండల పరిధిలోని చినకోండ్రుపాడు విశ్వనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య విశ్వంజీ ఔదంబర వృక్ష పీఠ సుస్థాపిత దత్త గురువులకు విశేష అర్చన చేశారు. అనంతరం యాగశాలలో వేద పండితులు శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠ, మహాగణపతి హవనం, సుదర్శన నారసింహ, శ్రీ మహారుద్ర హవనములు, స్థాపిత దేవతా పంచోపచార పూజ, నీరాజన, మహామంత్రపుష్ప చతుర్వేద సేవలను చేశారు. తొలుత శాంతిపాఠం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యమేళన ప్రాశనం, రక్షాబంధనం, ఆచార్యాది ఋత్విక్ వరణం, వాస్తు, నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, సర్వతోభద్ర, సుదర్శన నారసింహ, మహామృత్యుంజయ సప్త చిరంజీవి ఆవాహనం, అఖండదీప స్థాపన కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ ప్రత్యేక పూజలు చేయించారు. రాత్రి ఆడిటోరియంలో విశ్వణి కూచిపూడి నాట్య ప్రదర్శన, లోల మనస్వి, నిధిమల భరతనాట్య ప్రదర్శన, కొటూరి గాయత్రి సంగీత విభావరి, ఫణికుమార్ వేణుగాన కచేరీలు అలరించాయి.

మిర్చి రైతులకు అండగా ఉంటాం !

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నేతలు



రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సంఘ నాయకులు

లక్ష్మీపురం: మిర్చి రైతులకు అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నేతలు స్పష్టం చేశారు. సోమవారం గుంటూరు మిర్చి యార్డును నేతలు సందర్శించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన రూ.11,781 మద్దతు ధరతో రైతుల ఆశలు అడియాసలయ్యాయని తెలిపారు. కనీసం రూ.20వేలు అయినా ప్రకటిస్తారని ఎదురు చూశారని పేర్కొన్నారు. తీరా గుంటూరు మార్కెట్ యార్డుకు వస్తే వ్యాపారస్తుల దోపిడీకి రైతులు బలి అవుతున్నారని చెప్పారు. మచ్చు, కమిషన్, గోతం పేరులతో క్వింటాకు వెయ్యి రూపాయల వరకు దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డులో ఎన్నో రైతుల కన్నీటి గాథలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. జగన్నాథం, కంజుల విశాల్ రెడ్డి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమారెడ్డి, వీరారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులంతా క్షేమం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు



రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం అడ్డరోడ్డు సమీపంలోని అద్దంకి నార్కెట్‌పల్లి రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సు వెనుక భాగం ధ్వంసం అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును అదే మార్గంలో వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వెనుక భాగంలో ఇంజిన్ ఉండటం వల్ల లారీ ఢీకొట్టినా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగటానికి గల కారణాలపై ఆరా తీశారు. రాత్రిళ్లు రహదారిపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయకుండా పెట్రోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు వెంట పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

బంగారం చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి: ఆత్మకూరు అండర్ బైపాస్ వద్ద ఫిబ్రవరి 5న జరిగిన ఐదు కేజీల బంగారం కేసులో మరో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. చోరీలో ఐదవ నిందితుడు ఖాజావలి కోర్టులో లొంగిపోయేందుకు రాగా, నిఘా ఉంచిన అధికారులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. నిందితులందరిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మరో ఇద్దరు పరార్



మాట్లాడుతున్న తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగరం రైల్వే బ్రిడ్జి సమీపంలో గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. ఈ సంఘటనపై సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కల్యాణ్ రాజు వివరాలు వెల్లడించారు. విజయవాడలోని విద్యాధరపురానికి చెందిన గుమ్మడి సాయికుమార్ మరో ఇద్దరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లామని తెలిపారు. ఈ దాడిలో సాయికుమార్ వద్ద 1050 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఉండవల్లికి చెందిన మహేష్, విజయవాడకు చెందిన కోటి పరారయ్యారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న సాయికుమార్‌ను కోర్టుకు హాజరు పరచనున్నామని తెలిపారు. గంజాయి అమ్మకాలతోపాటు తాగే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైంగిక దాడి యత్నం కేసులో విచారణ

చెరుకుపల్లి: మండలంలోని ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి యత్నం కేసులో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని రేపల్లె డీఎస్పీ ఆవల శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం ఆరేపల్లి పంచాయతీ పరిధిలో చిన్నారిపై లైంగిక దాడి యత్నం కేసులో భాగంగా డీఎస్పీ సోమవారం గ్రామంలో పర్యటించి స్థానిక వీఆర్వో శివ నాగేశ్వరరావు సమక్షంలో చిన్నారి కుటుంబ సభ్యులను విచారించారు. వివరాలు అడిగి తెలుసుకొని నమోదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఘటనపై ఇప్పటికే క్లూస్ టీమ్ ఆధారాలు, వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా కేసుపై తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. డీఎస్పీ వెంట స్థానిక ఎస్సై టి.అనీల్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యాసంస్థల్లో మహిళల భద్రత, హక్కులు, సాధికారిత, మహిళా చట్టాలు, ఫోక్సో చట్టం, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. పోటీల అనంతరం స్టేషన్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశాలను ఏర్పాటు చేసి మహిళల రక్షణకు పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు చైల్డ్ 1098, ఉమెన్ 181, పోలీస్ 112, సైబర్ క్రైమ్ 1930 నెంబర్లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ వర్కర్స్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

లక్ష్మీపురం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మున్సిపల్ కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. తీరా గద్దె నెక్కాక వాటిని మరిచిందని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసి దాని స్థానంలో ప్రైవేట్ కంపెనీలకు, ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల జీవితాలతో వారు చెలగాటం ఆడతారని తెలిపారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని కోరారు. విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆప్కాస్ ఉద్యోగ, కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి కోట మాలాద్రి, మంగళగిరి పట్టణ కార్యదర్శి దుర్గారావు, కార్మికులు పాల్గొన్నారు.

వర్సిటీ మహిళల బాల్ బాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పాల్గొన్న ఐదు కళాశాలల జట్లు



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ పీడీ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత కోటేశ్వరమ్మ

నరసరావుపేట రూరల్: మహిళలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. వర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బాడ్మింటన్ పోటీలు కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలో ఐదు జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీపీఎస్ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత పాతూరి కోటేశ్వరమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉంటూ ఆటలాడుతూ చదువులో కూడా ముందుండాలని సూచించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో వర్సిటీ జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కరైకుడిలోని అల్లప్ప యూనివర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా అంతర వర్సిటీ పోటీల్లో వర్సిటీ జట్టు పాల్గొంటుందని తెలిపారు. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సిహెచ్ వెంకట్రావు, జె.ప్రేమ్‌కుమార్, ఇ.ఆదిబాబు, డాక్టర్ అరుణ సుజాతలు వ్యవహరించారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సేవలు ప్రైవేటుకు అప్పజెప్పొద్దు

కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నేతలు, కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నరసరావుపేట: జీఓవెంటనే 279ని సత్వరం రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు పారిశుద్ధ్య సేవలు అప్పజెప్పే విధానాన్ని విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గతంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి లక్షలాదిగా తరలివెళ్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, దాసరి రాజు, జయరాజు, వరహాలు, వందనం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొట్టిపాడు శివాలయంలో చోరీ

- స్వామి వారి వెండి కిరీటంతో పాటు అమ్మవారి బంగారు నగల అపహరణ



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ

ప్రత్తిపాడు: గొట్టిపాడు శివాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి దేవతా మూర్తుల బంగారు, వెండి నగలను అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు ఆదివారం రాత్రి ఎప్పటిలానే పూజలు నిర్వహించి తాళాలు వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని దుండగులు ముఖానికి మాస్కు, చేతికి గ్లౌజులు ధరించి ఆలయంలోకి ప్రవేశించారు. ప్రధాన ద్వారానికి ఉన్న పెద్ద పెద్ద తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో, ఇనుప కడ్డీలు వంచి గుడి లోపలకు చొరబడ్డారు. నాలుగు కేజీల కాశీవిశ్వేశ్వరుని వెండి నాగాభరణంతో పాటు సుమారు నలభై గ్రాముల అమ్మవారి బంగారు తాళి బొట్టుతాడు, తాళి బొట్లు రెండు, ముక్కెర, బంగారు బొట్టు బిళ్ల, ఉత్సవమూర్తుల వెండి వస్తువుల అపహరించుకుపోయారు. వీటి విలువ ఎనిమిది లక్షల రూపాయలపైన ఉంటుందని చెబుతున్నారు. సోమవారం ఉదయం గ్రామస్తుడు వెలివెల్లి శ్రీనివాసరావు ఆలయంలో ప్రదక్షిణలు చేసేందుకు వెళ్లాడు. అప్పటికే ఉత్తరం వైపు ద్వారాలతో పాటు తూర్పువైపు ద్వారాలు తీసి ఉండటంతో విషయాన్ని గ్రామస్తులకు, ఆలయ అర్చకులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న వ్యవస్థాపక ధర్మకర్త పచ్చల అప్పారావు ఆలయానికి వచ్చి చూశారు. అప్పటికే దేవతామూర్తుల ఆభరణాలు కనిపించకపోవడంతో ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ జి. శ్రీనివాసరావు, ఎస్ఐ కె. నాగేంద్రలు దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. స్థానికంగా ఆలయం సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో రంగంలోకి దిగి వేలిముద్రలను సేకరించింది. అర్చకుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.